నేటి దినపత్రిక
# సూర్య
18వ
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,26 అక్టోబర్ 2024 8 పేజీలు

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**- ఎంపి పుట్టా మహేష్,ఎమ్మెల్యే పత్సమట్ల,టిడిపి జిల్లా అధ్యక్షులు 'గన్ని'**



**నిడమర్రు,మేజర్‌న్యూస్ :** సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యపడుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఉంగుటూరు నియోజక వర్గం పరిధిలోని నిడమర్రుమండలంచిన్న నింద్ర కొలను నుంచి తోకలపల్లి గ్రామం వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ 1 కోటి వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు తమ

- తరువాయి 2లో..

## దీపావళి దుకాణాల ఏర్పాటుకు

# నిబంధనలు తప్పనిసరి

**- విక్రయ కేంద్రాల వద్ద జాగ్రత్తలు పాటించాలి**
**- మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కంట్రోల్ రూమ్‌లు**




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగరోజున ఎటువంటి ప్రమాధాలు జరుగకుండా సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లాఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసిజిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి బాణాసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలు,నిబంధనలు, అంశాలపై సంబంధిత అధికారులు,జిల్లాలోని ఆర్డివోలు, తహశీల్దార్లు, తదితరులతోజూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సహాలతో దీపావళి పండుగ నిర్వహించుకునేలా సంబంధితశాఖలు మంచి సమన్వయంతో పనిచేయాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ప్రభుత్వం జారీచేసిన విధివిధానాలకు అనుగుణంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. టపాసుల విక్రయ దుకాణాదారులు సురక్షాపరమైన చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాదారులతో తీసుకోవల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించిచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బాణాసంచా తయారీ కేంద్రాలు, నిల్వచేసేగోడౌన్లు,విక్రయించే దుకాణా లకు అనుమతులు తప్పనిసరి అన్నారు. పోలీస్, అగ్నిమాపక శాఖ,విద్యుత్ శాఖల నిబంధనలు, జాగ్రత్తలను విధిగా పాటించాలన్నారు. బాణాసంచా సామాగ్రి తయారీ,నిల్వ కేంద్రాలు నివాసాలకు నిర్ధేశించిన దూరంలో ఉండాలని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలుజరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం మాక్ డ్రిల్ నిర్వహించాల ని అధికారులకు

- తరువాయి 2లో..

## రాయలం పంచాయతీ కార్యాలయం

# ఆకస్మిక తనిఖీ

**- ఉద్యోగులను పనితీరు మెరుగుపరచుకోవాలి : జిల్లా కలెక్టర్**





**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం మండలం రాయలం పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తొలుతపంచాయతీలోని అన్నిగదులను పరిశీలించారు. పంచాయతీ భవనం కింది అంతస్తులో ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతూ రోజుకు ఎంతమంది వైద్య సహాయం కోసం వస్తున్నారు. అవసరమైన మందులుఉన్నాయాఅని ప్రశ్నించారు. అనంతరం రాయలం-1అండ్2 సచివాలయాల సిబ్బంది ఒక్కొక్కరితో మాట్లాడి వారు చేస్తున్న పని వివరాలను ఆరా తీశారు. పనితీరును మెరుగుపరచుకోవాలని

- తరువాయి 2లో..

## పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి : జిల్లా ఎస్‌పి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పోలీసు సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్‌ను ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు ,విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, ఏ.అర్ సిబ్బంది హెూమ్‌గార్డ్స్‌వారి సమస్యలు గురించిఎస్పీకి తెలియ చేశారు. జిల్లా ఎస్పీ సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగుపరిష్కారచర్యలు తీసుకుంటా మని సిబ్బందికి భరోసా కల్పించారు.

- తరువాయి 2లో..

## కొత్తపల్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**లింగపాలెం,మేజర్‌న్యూస్:** చింతలపూడి నియోజకవర్గపరిధిలోనిలింగపాలెం మండలం, కొత్తపల్లి గ్రామానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వరాలజల్లు కురిపించారు. కొత్తపల్లిలో ఎంపీ శుక్రవారం పర్యటించారు. కొత్తపల్లి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, అధికారులు,కూటమి నాయకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఎంపీ అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికు ప్రజలు రహదారులను అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలు సావధానంగా విన్న ఆయన సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తపల్లి గ్రామంలో రహదారుల అభివృద్ధికి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

కొత్తపల్లి గ్రామంలో అటవీ భూములు సాగు చేసుకుంటున్న పేదలను ఇబ్బందులకు గురి చేయవద్దని, నిబంధనలకు లోబడి వ్యవహరించాలని ఎంపీ అటవీ శాఖ డీఎఫ్ఓ, రేంజ్ అధికారికి ఫోన్ చేసి తెలియజేశారు. అనంతరం ఎంపీ పుట్టా రంగాపురం సత్య నారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సంధర్బంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సూచించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో అభివృద్ధి పనులపై ఐటీడీఏ పీవో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ ముందుగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులు, నాబార్డ్, ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరు చేసింది ఎన్ని రోడ్డు పనులు ప్రారంభించారు, ఎన్ని పనులు పూర్తి చేసారు, ఎన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందో సంబంధిత అధికారులు ద్వారా ఆరా తీశారు. అదేవిధంగా ఫారెస్ట్ క్లియరెన్స్‌కు ఎన్ని రోడ్లు పెండింగ్ లో ఉన్నవి ఆయన ఆరా తీశారు. ఐటీడీఏ ఉద్యానవన శాఖ ద్వారా ఇప్పటివరకు గిరిజన రైతులకు ఏ మొక్కలు సరఫరా చేసింది, ఎన్ని మొక్కలు సరఫరా చేసింది, ఇంకా ఎన్ని మొక్కలు సరఫరా చేయవలసి ఉన్నది వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్ని ఎకరాలలో రబ్బరు ప్లాంటేషన్ వేసింది ఆయన ఆరా తీశారు.

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నది, ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించింది, అదేవిధంగా వ్యాధిగ్రస్తులకు హెల్త్ కార్డులు ఎంతమందికి జారీ చేసారో ఆరా తీశారు. ఏజెన్సీలో ఎంతమందికి టీబి పరీక్షలు చేసింది ఎంతమందిని గుర్తించింది ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో అన్ని పాఠశాలలో విద్యార్థులకు నెల నెలా వైద్య పరీక్షలు ఆరు నెలల్లో ఎంతమందికి నిర్వహించింది, అదేవిధంగా ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ హాల్స్ ఉన్నవి అదేవిధంగా ప్రస్తుతం ఎంత మంది గర్భిణీ స్త్రీలు ఉన్నది అదేవిధంగా ఆస్పత్రులలో ఎంతమంది గర్భిణీ స్త్రీలకు డెలివరీలు చేసింది వైద్యాధికారుల ద్వారా ఆయన ఆరా తీశారు. ఐసిడిఎస్ ద్వారా ఏజెన్సీలో అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బాల బాలికలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం ఏ విధంగా అందజేస్తున్నారు, అదేవిధంగా ఎంతమంది బాలబాలికలకు, ఎంతమంది గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం సరఫరా చేయుచున్నది పిఓ ఆరా తీశారు. గిరిజన సంక్షేమశాఖ, ఏజెన్సీ విద్యాశాఖ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో గిరిజన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏవిధంగా పాఠాలు చెబుతున్నారు, అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ పక్కగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులకు బేస్ లైన్ శిక్షణ కార్యక్రమం ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చింది ఇంకా ఎంతమందికి శిక్షణ ఇవ్వవలసివున్నది వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులకు పై చదువులు చదువుకునే విధంగా ఎంతమంది విద్యార్థులకు అవగాహన కల్పించింది ఆయన ఆరా తీశారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని పనులు గుర్తించింది ఆయన ఆరా తీశారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏజెన్సీలోని ఎంతమంది గిరిజన రైతులకు ఇ-క్రాపింగ్ బుకింగ్ చేసింది అదేవిధంగా ఈ సంవత్సరం ఎంతమంది రైతులు వరి సాగు చేయుచున్నది ఆయన ఆరా తీశారు.

వెలుగు ద్వారా ఏజెన్సీలో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఏ కార్యక్రమాలు నిర్వహించుచున్నది, అదేవిధంగా ఎన్ని మహిళా సంఘాలు, ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నది సంబంధిత అధికారులను ఐటీడీఏ పీవో ఆరా తీశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎస్ఓ మార్తమ్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిహెచ్ఓ చిట్టిబాబు, పిఎవో రాంబాబు, ఏడిఏ లు సి.హెచ్.కె.వి.చౌదరి, కే.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సుబ్బయ్య, డిఇ లు చైతన్య, శ్రీనివాసరావు, రాజేంద్రబాబు, సూపర్డెంట్ బి.కిషోర్, వెలుగు ఏపిడి దేగలయ్య, యాంకర్ పర్సన్ రామరాజు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

# మూడు సిలెండర్లు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

**– జాయింట్ కలెక్టర్ నిషాంతి**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం అమరావతి నుండి పౌరసరఫరాలశాఖ కమిషనర్ జి.వీర పాండ్యన్ మరియు డిసిఎస్ మనజీర్ జిలానిలు జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, చౌక ధరల దుకాణాలు నిర్వహణ, ధరల నియంత్రణ అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న గ్యాస్ కనెక్షన్ నెంబరు ఆధార్ నెంబరు, రైస్ కార్డు నెంబరు డేటాబేస్‌లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులవుతారన్నారు.

అటువంటి డేటాను డిపార్ట్మెంట్ డేటాతో సరిపోల్చుకున్నాక అర్హులగా నిర్ధారించబడతారన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈనెల 29 నుండి మార్చి 30వ తారీఖు లోపు ఒకటి సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు. ఆ విధంగా బుక్ చేసుకున్న సిలిండర్‌కు లబ్ధిదారుడు ధరను ఆన్లైన్‌లోగాని ఆఫ్లైన్లో గాని చెల్లించాలన్నారు.

# రాయలం పంచాయతీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

మొదటిపేజి తరువాయి

హెచ్చరించారు. ప్రత్యేక ఆధార్ సవరణ క్యాంప్‌ల సమాచారాన్ని గ్రామ ప్రజలకు చేరవేయడంలో అలసత్వం కనిపిస్తుందని, భవిష్యత్తులో ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాయలంలో పంచాయతీ పరిధిలో రూ.1.48 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ పనులపై ఆరా తీశారు. పంచాయతీ సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం గ్రామ ప్రజలు రాయలం మురుగు డ్రైన్ సమస్యను జిల్లా కలెక్టర్ ను కలిసి విన్నవించడం జరిగింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే ప్రతిపాదనలను సమర్పించడం జరిగిందని, నిధులు మంజూరు అయిన వెంటనే పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రాయలం మురుగు కాలువను జిల్లా కలెక్టర్ సంబంధిత గ్రామ ప్రజలతో కలిసి స్వయంగా పరిశీలించారు. రాయలం పర్యటన సందర్భంలో డిపిఓ వి.అరుణ శ్రీ,ఎంపీడీవో ఎన్.మురళి గంగాధర్ రావు, పంచాయతీ సెక్రటరీ డి.ఎస్ పద్మాజీరావు, ఈవోపీఆర్డి జె.వి.నామేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ , స్పెషల్ ఆఫీసర్ ఎం.కనకారావు,వీఆర్వో కె.శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోళ్ల రామచంద్రరావు, స్థానిక నాయకులు పత్తి హరి వర్ధన్, వీరమల్లు శ్రీనివాస్, బి నాగ శ్రీనివాస్, వై శివరామకృష్ణ, కే హేమంత్ శ్రీనివాస్,కే పావని, సిహెచ్ లక్ష్మి తులసి భవాని, సిహెచ్ ప్రతిభ, ఏ.చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ డ్వార్ఫిజం డే సందర్భంగా అవగాహన సదస్సు




ఏలూరు,మేజర్‌న్యూస్: దొండపాడు నందు గల ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల కోటదిబ్బ నందు శుక్రవారం వరల్డ్ డ్వార్ఫిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిసిపాల్ ఐ .బి. విశ్వనాద్ పాల్గొన్నారు. అనంతరం మొదటగా కళాశాల ప్రిసిపాల్ మాట్లాడుతూ 'మరుగుజ్జు అనేది ఎక్కువగా జన్యుపరమైన లోపం, ఈ వ్యాధి సంభవించిన వారు సాదారణ వ్యక్తులకంటే ఎత్తు తక్కువగా ఉండడం జరుగుతుంది. ఒకటి లేదా ఇద్దరి తల్లిదండ్రుల నుండి వారసత్వంగా పొందవచ్చు. ఈ సందర్భంగా సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రోత్ హార్మోన్ లోపం మరుగుజ్జు తత్వానికి ఒక సాధారణ కారణం. శరీరం తగినంత గ్రోత్ హార్మోన్‌ను ఉత్పత్తి చేయనప్పుడు సంభవిస్తుంది,ఈ వ్యాధి సంబవించిన వారు ఎత్తు పెరగడంలో సమతుల్యత కోల్పోతారు అని తెలియజేసారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

మొదటిపేజి తరువాయి

ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారధ్యంలోని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సహకారంతో అమరావతి, పోలవరం, ఇతరత్రా అభివృద్ధిపనులుపూర్తిచేయడంజరుగుతుందని ఎంపీపేర్కొన్నారు.

# దీపావళి దుకాణాల ఏర్పాటుకు నిబంధనలు తప్పనిసరి

మొదటిపేజి తరువాయి

సూచించారు. జన నివాసాలకు,విద్యా సంస్థలు, ఆసుపత్రులకు దూరంగాబాణాసంచావిక్రయాలు నిర్వహించా లన్నారు.ప్రతి దుకాణం వద్ద అగ్నినిరోధిక సిలిండర్లు,బక్కెట్లలో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో దుకాణాలు ఏర్పాటుచేసే మైదానంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసే చోటా, రెండు ప్రవేశ మార్గాలు ఉండేలా చూడాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు బాణా సంచా వినియోగం నిషిద్ధమని స్పష్టం చేశారు. దుకాణాలు ఏర్పాటుచేసిన చోట అవసరమైన ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా మందుగుండు సామాగ్రి తయారుచేసినా, నిల్వచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి వాటిని తనిఖీ చేయాలన్నారు. బాణాసంచా దుకాణాల వద్ద అనువైన పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఫైర్ ఆఫీసరు సిహెచ్ రత్నబాబు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్,ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిఎస్‌డిఓ బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి : జిల్లా ఎస్‌పి

మొదటిపేజి తరువాయి

ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తామని,పోలీస్ సిబ్బంది సమస్యలపైసత్వరచర్యలుతీసుకోని పరిష్కరిస్తమన్నారు.

# రూ.2.79లక్షల విలువైన 12.40 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



ఉంగుటూరు,మేజర్‌న్యూస్: ఉంగుటూరు మండలం చేబ్రోలు రైతు సేవా కేంద్రమ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇంతవరకు రూ. 2.79లక్షల విలువైన 12.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సమీపములోను రైస్ మిల్లుకు తరలించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రైస్ మిల్లరు రశీదు ఇచ్చిన 48 గంటల లోపే రైతు అధార్ అనుసంధానిత బ్యాంక్ ఖాతాలో ధాన్యం సోమ్ము జమ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో నేటి వరకు సుమారు 39.10 లక్షల మంచి స్థితిలో ఉన్న గోనే సంచులు మిల్లర్ల చేత బాగు చేయించి రైతు సేవా కేంద్రములకు పంపేందుకు సిద్దంగా ఉంచడమైన దన్నారు. జిల్లాలో ప్రోక్యూర్మెంటు సపోర్టింగ్ ఏజన్సీలైన కొఅపరేటివ్ సొసైటిల ద్వారా 164, డిసిఎంఎస్ ల ద్వారా 75, రైతుల ఉత్పత్తి సంస్థలల ద్వారా 11 రైతు సేవా కేంద్రాలు వెరశి 250 ధాన్యం కొనుగోలు కేంద్రములుగా ఏర్పరిచి రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. ప్రోక్యూర్మెంటు సపోర్టింగ్ సంస్థలు వారే చేతనే ధాన్యం కొనుగోలునకు అవసరమైన సిబ్బంది అనగా డేటా ఎంట్రీ అపరేటరును, సాంకేతిక సహాయకులును, సహాయకులులను నియమించి ధాన్యం కొనుగోలు ఏలా చేయాలనే విషయంలో మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో,జిల్లా స్థాయిలో వారికి కావలసిన శిక్షణ ఇవ్వడమైనదన్నారు. రైతుల సందేహాలపై తగిన సలహాలు, సమాచారం పొందుటకు వారి ఫిర్యాదులను చేయుటకు ,వాటి పరిష్కరం కొరకుజిల్లాస్థాయిలో కంట్రోల్‌రూమ్(కంట్రోల్‌రూమ్ నెంబర్లు 7702003584,టోల్ ఫ్రీ 18004256453) ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## ఆర్అండ్ఆర్ అవకతవకలపై విచారణ చేపట్టాలి



వేలేరుపాడు,మేజర్ న్యూస్ : ఆర్అండ్ఆర్ లిస్టులో నిర్వాసితుల పేర్లు గల్లంతు చేసిన వారిపై విచారణ చేపట్టాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి యస్ కె గౌస్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జగన్నాథ పురం గ్రామంలో 144 మంది నిర్వాసితుల పేర్లు గల్లంతు చేసిన వారిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ చెల్లించడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. మండలంలోని అన్నీ గ్రామాల ఆర్ అండ్ ఆర్ లిస్టు బహిరంగం చేయాలని కోరారు.పూర్వం నుండి గ్రామాల్లో నివాసం ఉంటున్న నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.అర్హులైన ప్రతిఒక్క నిర్వాసితునికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి సోయం చందరావు, ముత్యాలరావు, రామారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలతో విద్యాశాఖ అధికారుల సమీక్ష



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించిన మండల విద్యాశాఖ అధికారులు వి.హనుమ, జ్యోతి. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అపార్ కార్డులు ప్రక్రియ, యుడైస్ ప్లస్ ,ఎస్ఎస్ఎంపి పరీక్షలు,మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించిన మండల విద్యాశాఖ అధికారులు హాజరైన వారికి తగు సూచనలు ఇచ్చారు. వివిధ అంశాల నమోదు విషయంలో ప్రైవేటు విద్యాసంస్థలు అలసత్వం చూపరాదని తెలియజేశారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు ధర్నా



బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్: శానిటేషన్ వర్కర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో తేదీన ప్రభుత్వం జీవో నెంబర్ 413ని విడుదల చేసిందని జీవో ప్రకారం స్కూల్ శానిటేషన్ వర్కర్స్, నైట్ వాచ్మెన్ల వేతనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. విద్యార్థులు ఎక్కువమంది ఉండటంవల్ల పని భారం ఎక్కువ అవుతుందని తెలియజేశారు. శానిటేషన్ వర్కర్లకి ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని గుర్తింపు కార్డులో ఇవ్వాలని రెండు జతల యూనిఫాం,గ్లౌజులు మాస్కులు తదితర వస్తువులు అందజేయాలని కోరారు. శానిటేషన్ వర్కర్లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఏడి షరీఫ్‌కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట లక్ష్మి, రత్న కుమారి, నాగమణి, మంగ,సంధ్య,సోమాలమ్మ, రామలక్ష్మి, గంగాదేవి తదితరులు ఉన్నారు.

# ముగిసిన క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం



ఏలూరు,మేజర్ న్యూస్: స్థానిక గ్రీన్ సిటీలో లయన్స్ జిల్లా 316జి లీడర్ షిప్ ఇనిస్టిట్యూట్ లో జరుగుతున్న 2రోజుల క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది.ఈ రెండు రోజుల శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయులకు ఆత్మవిశ్వాసం పెంపొందించే విషయాలు,గుడ్ టచ్,బాడ్ టచ్,విద్యార్థుల మానసిక వికాసం,భావోద్వేగాలు నియంత్రించే విషయాలు, ప్రభావితం కలిగించే పలు అంశాలపై లయన్స్ క్వెస్ట్ ట్రైనర్, ఫ్యాకల్టీ డాక్టర్ కె.లక్ష్మీమూర్తి శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథి, లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా బుద్ధులతో పాటు మంచి మార్పు కలిగించే అనేక విషయాలను క్వెస్ట్ కార్యక్రమం ద్వారా తెలుసు కున్న ఉపాధ్యాయులు ఆచరణలో మంచి ఫలితాలు సాధించాలన్నారు.రెండు రోజులుగా జరిగిన క్వెస్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల ను అందజేశారు. డిస్ట్రిక్ట్ చైర్మన్ వి.సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి ఉప గవర్నర్ ఎన్.వి.వి.ఎస్.పాపారావు నాయుడు,రెండోవ ఉప గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు,లయన్స్ జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, వి.రామారావు ,ఎల్. వెంకటేశ్వరరావు,ఎస్. కామేశ్వరరావు,జోన్ చైర్పర్సన్ డాక్టర్ డి.సరస్వతి,జింగిల్ బెల్స్ పాఠశాల ప్రిన్సిపాల్ కె. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కుక్కునూరు మండలానికి తీరనున్న లోఓల్టేజ్ సమస్య



కుక్కునూర్,మేజర్ న్యూస్: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముల్లిశెట్టి నాగేశ్వరరావు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలానికిలో వోల్టేజ్ సమస్య ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధించిన అధికారులతో ఎంపీ మాట్లాడారని చెప్పారు. త్వరలోనే అల్లూరి జిల్లా ఎటపాక మండలం నుంచి గోదావరి మీదుగా 4 విద్యుత్ టవర్లను ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా చేయడం జరుగుతుందని ఎంపీ మహేష్ చెప్పారని నాగేశ్వరరావు తెలిపారు. పోలవరం పరిహారం విషయంలో నిర్వాసితులు కొంతమందిలో ఆందోళనఉందని, ఎవ్వరు కూడా భయపడ్డొదని, 2019లో జరిగిన సర్వేను అనుసరించి,ఆనాటి అవార్డు జరిగిన ప్రకారమే పరిహారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో చుంచు సత్యనారాయణ పులి శ్రీనివాస్ కోటగిరి సత్యనారాయణ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## మంచినీటి శుద్ధీకరణ యంత్రం అందజేత



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూలు విద్యార్థులు ఆరోగ్య దృష్ట్యా మోండలీజ్ (కోకోకోలా) సంస్థ వారు స్థానిక హైస్కూల్ కి విద్యార్థుల కొరకు 250 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి శుద్ధీకరణ యంత్రం ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ మాట్లాడుతూ మోండలీజ్ వారి దాతృత్వాన్ని కొనియాడారు.మోం డలీజ్ సంస్థ మేనేజర్ రాజేష్,అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర,బాబు,మనోజ్,ఆక్ఫ్రో సంస్థ నుండి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు,ఏరియా ఫీల్డ్ సిబ్బంది శివ,రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి సురేష్ తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు,మల్లయ్య,రమేష్, కుమారస్వామి, శారద మొదలగు సిబ్బంది విద్యార్థులు,పాఠశాల అభివృద్ధి కమిటీ వారు మోం డలీజ్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటు నమోదు చేయించుకోండి - ఎన్డీఏ కూటమి నేతలు



నర్సాపురం,మేజర్‌న్యూస్ : ఎన్డీఏ కూటమి పార్టీలు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో రేపు జరగబోయే పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా గురువారం వైన్ కాలేజీ సందర్శించి ప్రిన్సిపాల్ గ్రాడ్యుయేట్ ఓటర్లు అందర్నీ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా అభ్యర్థించారు.అనంతరం సాయంత్రం స్థానిక సూర్య కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ని కాలేజీలో వారి స్టాఫ్ ను కలిసి పట్టభద్రుల ఓటును నమోదు చేసుకోవాల్సిందిగా అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ,బిజెపి పట్టణ అధ్యక్షులు ముసుకోటి వెంకటేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కొప్పర్తి వెంకట్, పట్టణ ప్రధాన కార్యదర్శి అగ్నిహోత్రం రవికిరణ్, ఓబిసి మోర్చ రాష్ట్ర సీనియర్ న్యాయవాది వనమాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు వద్దు - గ్రామాభివృద్దే లక్ష్యం

## – ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే బొలిశెట్టి పిలుపు



**పెంటపాడు,మేజర్‌న్యూస్:** ఎన్నికల వరకే రాజకీయాలని ఎన్నికల మూసిన తర్వాత గ్రామాభివృద్ధిలో పోటీపడాలని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులకు హితో పలికారు. శుక్రవారం పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామస్థాయిలో చిన్న చిన్న తగాదాల ద్వారా అభివృద్ధికి ఆటంక పడవద్దు అని, అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడిన సహించేది లేదన్నారు. ప్రభుత్వంలో తగినన్ని నిధులు లేకపోవడంతో కనీసఅవసరాలు అభివృద్ధివిషయంల దాతల సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. మండల స్థాయిలో దాతలు అందరిని ఒకచోట సమావేశం ఏర్పాటు చేస్తే తనే స్వయంగా వారిని అభ్యర్థించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములుగా చేర్చుదామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పంచాయతీ నిధులు పంచాయతీలోనే వాడుకునేలా సర్పంచులకు అధికారాలు కల్పించారన్నారు. ముందుగా త్రాగునీరు,రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని దీనికి స్థానిక నాయకులందరూ సహకారం అందించాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పూరీజగన్నాథ్,రామ్ పోతినేని పవర్ఫుల్ మాస్ ఎంటర్టైనర్ ‘డబుల్ఇస్మార్ట్’, ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీతెలుగులో!




ఏలూరు,మేజర్‌న్యూస్:తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలోఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్ఎంటర్టైనర్ ‘డబుల్ ఇస్మార్ట్’ సినిమాను ఈవారం వరల్డ్ టెలివిజ ప్రీమియర్‌గా అందిస్తోంది. అద్భుతమైన కథ,కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నటవిశ్వరూపంతో బాక్సాఫీస్ వద్ద మంచి మార్కులు కొట్టేసిన డబుల్ఇస్మార్ట్, ఈ ఆదివారం (అక్టోబర్ 27న) సాయంత్రం6 గంటలకు, మీజీ తెలుగులో మాత్రమే! పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించినఈ సినిమా కథఅంతర్జాతీయ మాఫియాడాన్ బిగ్‌బుల్ (సంజయ్‌దత్)చుట్టూ తిరుగుతుంది. అతను గ్లియోమా నిర్ధారణఅయినతర్వాత మరణంనుండి తప్పించుకోవడానికి ఆరాటపడతాడు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకుబదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయేవ్యక్తికోసం అన్వేషణ మొదలవుతుంది. ఆఅన్వేషణలో హైదరాబాద్‌లోని శంకర్ (రామ్‌పోతినేని)సరైన వ్యక్తిగా గుర్తించడంతో బిగ్బుల్ మెమరీ ట్రాన్స్ ఫర్ జరుగుతుంది,ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినమాచూడాల్సిందే.

రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే, ఝాన్సీ వంటినటులు కీలక పాత్రలు పోషించారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్తో రూపొందిన ఈ మాస్ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ ఆదివారం మీరూ తప్పకుండా చూడండి.

# 29న కైకరంలో ధాన్యం మద్దతు ధర - కొనుగోలు సమస్యలపై సదస్సు



ఉంగుటూరు,మేజర్ న్యూస్: ఈనెల 29న కైకరంలో ధాన్యం మద్దతు ధర – కొనుగోలు సమస్యలపై జిల్లాస్థాయి రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం కైకరంలోని తూర్పు వీధి రామాలయం వద్ద 29న జరిగే జిల్లా స్థాయి రైతు సదస్సు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకులు విడుదల చేశారు.

ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర కోసం జరుగుతున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సు 29న మధ్యాహ్నం 1గంటకు తూర్పు వీధి రామాలయం ఎల్ఐసి వేదిక వద్ద జరుగుతుందని చెప్పారు. అన్ని గ్రామాల నుండి వరి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు,జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్



**నర్సాపురం,మేజర్ న్యూస్:** పట్టణంలోని 14 వ వార్డులో గల డంపింగ్ యార్డు నందు వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెలుగుదేశం పార్టీఇంచార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి ప్రారంభించారు. గత కొంత కాలంగా పెండింగ్‌లో వున్న సుమారు 3.72 కోట్ల రూపాయల తో అవినాష్ కంపెనీ వారితో కుదుర్చుకున్న “లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్”కార్యరూపంలోకివచ్చింది. శుక్రవారం జరిగినఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేమాట్లాడుతూ ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి వార్ల సహకారం మరువలేనిది అని,వారి మద్దతు వల్ల ఈ రోజు ఈ యూనిట్ కార్యరూపం లోకి వచ్చింది అని, వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అవినాష్ కంపెనీ ద్వారా ఈ యూనిట్ నందు రోజుకు సుమారుగా 600 టన్నుల తడి, పొడి చెత్తను వేరు చేసి, గాజు, ప్లాస్టిక్,లోహపు చెత్తను వేరు చేసి వాటిని జిందాల్ కంపెనీ వారికి అందిస్తారు. ఇందులో ఆఖరుగా వచ్చే మట్టి రంగులో ఉండే దానిని ఆర్గానిక్ ఎరువుగా మార్చి రైతులకు అందించటంజరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో ఈకార్యక్రమంలో టిడిపి ఇంచార్జి పొత్తూరి రామరాజు మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ బర్రె వెంకటరమణ,వైస్‌చైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయలు,కౌన్సిలర్లు కోప్పాడికృష్ణవేణి,బొమ్మిడి సూర్యకుమారి,తోట అరుణ,భారతి సురేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన





ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరులో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి. ఏలూరు పాండురంగాపురం లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దసరా మహొత్సవాల ముగింపు సందర్భంగా సుమారు 4 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. గత 40 సంవత్సరాలుగా వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు దసరా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మొదట అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బడేటి చంటి,గారపాటి చౌదరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రామిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వడ్లపట్ల వెంకట రంగారావు,సెక్రటరీ జనపరెడ్డి జగదీశ్వర రావు, కోశాధికారి ఇమంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్: ద్వారకా తిరుమల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అధికారులు విజ్ఞప్తి చేశారు. శనివారం 26 తేదీన ద్వారకా తిరుమల సబ్ స్టేషన్ నుండి లక్ష్మీపురం గ్రామం వరకు కొత్త 11 కెవి ఫీడర్ స్కీమ్ ద్వారా వేస్తున్నారు. కనుక ఉదయం8గంటల నుండి సాయంత్రం 4వరకు కరెంట్‌కి అంతరాయం కలుగును. దీని వల్ల ద్వారకా తిరుమల,కొమ్ముగూడెం,లక్ష్మీపురం గ్రామలకు కరెంట్ సరఫరా అంతరాయం కలుగును అని తెలియజేయజేశారు.

## మార్చికి మరో 100 పడకల ఆసుపత్రి : ఎమ్మెల్యే బొలిశెట్టి





తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: వచ్చే ఏడాది మార్చి నాటికి మరో వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి రానున్నదని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 2021 వ సంవత్సరంలో నాబార్డు నిధులు రూ.9,45,75,387లతో పనులు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రూ.5,41,96, 564 లు పనులు జరిగాయన్నారు. మరో రూ.4,06,78,821లు విలువైన పనులు జరగవలసి ఉందన్నారు. ఈ పనులు వచ్చే ఏడాది మార్చి 31 తేదీ నాటికి పూర్తి చేయకపోతే లాప్స్ అయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రభుత్వం కాంట్రాక్టర్ కు నోటీసులు ఇచ్చినట్లు 2025 మార్చి 31వ తేదీ నాటికి పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారన్నారు.

రానున్న కాలంలో ఉంగుటూరు, గోపాలపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల మధ్య తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోనున్నారని అన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాలు వసతులు ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్వహించామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఆర్ఎంవో తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి భీమవరం రాక



**భీమవరం,మేజర్న్యూస్ :** త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి నల్లు శనివారం భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంఏలూరు జిల్లాఉంగుటూరుమండలం నారాయణ పురంలో ఒకకార్యక్రమంలోఆయన పాల్గొంటారు.అనంతరం సాయంత్రం 5 గం.లకు బయలుదేరి సా.6.30 గం.లకు భీమవరం పర్యాటక శాఖ అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి 7 గం.లకు పర్యాటక శాఖ అతిథి గృహంలో సమావేశానికి హాజరవుతారు. రా.8.30 గం.లకు స్థానికంగా విందుకు హాజరవుతారు. తిరిగి 9:30 గం.లకు టూరిజం గెస్ట్ హౌస్ కి చేరుకుని రాత్రి బస చేస్తారు. 27వ తేదీ ఆదివారం ఉ.7.30 గం.లకు టూరిజం అతిథి గృహం నుంచి బయలుదేరి ఆనంద ఫంక్షన్ హాల్ నందు వివాహ వేడుకలో పాల్గొంటారు.

ఉ.9గం.లకు ఆనంద ఫంక్షన్హాల్ నుండి దొంగపిండి ఫిష్ కల్చర్ ట్యాంక్ వద్దకు చేరుకుంటారు.ఉ.10 గం.లకు అక్కడి నుండి బయలుదేరి లోసరిలోని ఆనంద ఫిష్ ఫీడ్ ప్లాంట్ వద్దకు చేరుకుంటారు.అనంతరం ఉ.10:30 గం.లకు బయలుదేరి తుందుర్రు లోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్పార్క్అండ్ ఫంగస్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను సందర్శిస్తారు. మ.12 గం.లకు తుందుర్రు ఆనంద గెస్ట్ హౌస్ నందు భోజనం స్వీకరిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జువ్వలపాలెం ఆనంద గెస్ట్ హౌస్ చేరుకుని ఎలైట్ సిబ్బంది, వ్యాపారవేత్తలు, మీడియాతో పరస్పర చర్చలోపాల్గొంటారు.మ.3.గం.లకు బయలుదేరి తాడేపల్లిగూడెం వెళతారు. సా.4గం.లకు తాడేపల్లిగూడెంలో ప్రైవేటుకార్యక్రమంలో పాల్గొంటారు.సా.5గం.లకు తాడేపల్లిగూడెం నుంచి బయలుదేరి విజయవాడ విమానాశ్రయానికి వెళతారని సమాచారశాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**– వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి**



**నరసాపురం,మేజర్ న్యూస్ :** వైయస్సార్ పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.

ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్నికలలోచంద్ర బాబు ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని అన్నారు. గత వైసిపి పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దేశంలోని ఏ రాష్ట్రంలో లేనటువంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి పాటుపడ్డామన్నారు. ప్రణాళిక బద్ధంగా పనిచేస్తే పార్టీని మరింతఅభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఉండి నియోజికవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పి.వి.ఎల్. నరసింహరాజు,వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, మాజీ మంత్రికారుమూరి నాగేశ్వరరావు, పాలకొల్లు నియోజికవర్గ ఇంచార్జ్ గుడాల గోపి , ఎం.ఎల్.సి కవురు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ప్రసాదరాజును వారు అభినందించారు.

## భీమడోలులో జన్మభూమి,గౌతమి ఎక్స్ ప్రెస్ ఆపాలి

**– ఎంపి పుట్టా మహేష్,జిల్లా టిడిపి అధ్యక్షులు 'గన్ని'కి వినతి**



**భీమడోలు,మేజర్న్యూస్:** కురెళ్ళగూడెం గ్రామంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికివిచ్చేసినసంధర్భంగా ద్వారక తిరుమల పుణ్యక్షేత్రాన్ని దృష్టిలో పెట్టుకుని తీర్ధ యాత్రికులు,పరిసర ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం జన్మభూమి,గౌతమి ఎక్స్ ప్రెస్ లు భీమడోలు రైల్వేస్టేషలో నిలుపుదల చేయాలని భీమడోలు గ్రామస్తులు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్,జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుప్పల హరీష్, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్య నాయుడు,గన్ని నాగ గోపాలరావు, ముప్పిరిశెట్టి సుబ్రమణ్యం, మరపట్ల రామ తులశమ్మ, యెగ్గిన శ్యామల,గన్ని నాగ గోపాలరావు,గ్రామ మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వరదలో మీ సేవలు అమోఘం - ఎమ్మెల్యే నాయకర్

**నరసాపురం,మేజర్ న్యూస్:** ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలలో నరసాపురం మున్సిపాలిటీ నుండి 40 మంది పారిశుధ్య కార్మికులు,మున్సిపల్ సిబ్బంది విజయవాడ వెళ్ళి అక్కడ విపత్తు నిర్వహణ లో పాల్గొని బాధితులకు సహాయ సహకారాలు అందజేసారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద సహాయములో మీరు చేసిన సేవలు అమోఘమని, బాధితులకు మీరు అందించిన సహకారం మన నియోజకవర్గానికి ఎంతో పేరు తీసుకువచ్చిందని అన్నారు. చైర్ పర్సన్ శ్రీ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సేవలందించిన కార్మికుల కుటుంబాలకు దుస్తులను అందజేశారు. వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇంచార్జి పొత్తూరి రామరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగరాయలు, కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, కొప్పాడి కృష్ణవేణి, బొమ్మిడి సూర్య కుమారి,తోట అరుణ, భారతి సురేష్,ఆకన చంద్రశేఖర్ వలవల నాని గంట కృష్ణ నిప్పలేటి తారక రామారావు,



కోటిపల్లి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి నళిని, వట్టిప్రోలు సతీష్, బెల్లంకొండ నాయుడు, పొన్నాల నాగబాబు,మాధుం వాసు,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





ముదినేపల్లి ,మేజర్ న్యూస్ : పాఠశాలల పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని ఆయా మండల అధ్యక్షురాలు ఎన్ విజయలక్ష్మి అన్నారు.పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ముదినేపల్లి తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలలో ఉన్న వారు సుమారు 1900 మంది ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వేతనం తక్కువ పని భారం ఎక్కువగా ఉందన్నారు. ప్రతినెల 5 లోపు వేతనాలు చెల్లించాలన్నారు. 3 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని,ప్రమాద బీమా ఇచ్చి ఇ.ఎస్.ఐ సౌకర్యం కల్పించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్ఇవొ, డిప్యూటీ తహసిల్దార్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కే నాగరాణి , కోశాధికారి పి వెంకటపద్మ ,వి కరుణ ,పి రేణుక ,డి మణి,పి పెద్దింట్లమ్మ, సిహెచ్ నాగజ్యోతి,వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కండిగులమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: మండలంలోని బంధువులకుంట గ్రామ శివారులో పిలిస్తే పలికే అమ్మ కండిగల్ అమ్మ పోతురాజు ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో మహిళలు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరిం చారు.ఆలయ నిర్మాణ కర్త చిలుకూరు ధర్మారావు మాట్లాడుతూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే పిలిస్తే పలికి కోరిన కోర్కెలు తీరుస్తుందని తెలిపారు.

### 31న జరిగే ఏఐటియుసి సభను జయప్రదం చేయాలి




ఏలూరు,మేజర్ న్యూస్: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపైన, ప్రైవేటీకరణ విధానాలపైన ఏఐటియుసి నిర్వహిస్తున్న పోరాటాలు, ఆందోళనలలో అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు క్రియాశీలకంగా పాల్గొనాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు.శుక్రవారం స్ఫూర్తి భవనంలో ఏఐటియుసి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది. 2024 అక్టోబర్ 31న ఏఐటియుసి 105వ వ్యవస్థాపక దినోత్సవం ఏలూరు జిల్లాలో ఏఐటియుసి అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు ఘనంగా జరపాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబర్ 10వ తేదీన ఏలూరులో జరగనున్న ఏఐటియుసి అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయుటకు జిల్లా కమిటీ సభ్యులు అహర్నిశలు పనిచేయాలని ఆయన కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు కార్య కలాపాల రిపోర్టును సమర్పించారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏఐటియుసి నిర్మాణానికి అభివృద్ధికి పార్టీ పరంగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా నాయకులు కే.కృష్ణమాచార్యులు తొర్లపాటి బాబు చాట్ల పుల్లారావు బండి వెంకటేశ్వరరావు పుప్పాల కన్నబాబు కే విగ్నేష్ భజంత్రీ శ్రీనివాసరావు డి లక్ష్మణమూ ర్తి కుంచే వసంతరావు తదితరులు మాట్లాడారు.

# సర్వ మాలధారణ స్వాములకు భిక్ష కార్యక్రమం





ఏలూరు,మేజర్ న్యూస్: మార్కండేయ అండ్ ఓంకార విశ్వేశ్వర స్వామి,అయ్యప్ప స్వామి వారి దేవాలయం నందు సర్వ మాలధారణ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు వారి సతీమణి రెడ్డి అనురాధ ఏర్పాటు చేశారు. స్థానిక దక్షిణపు వీధిలో ఉన్న శ్రీ మార్కండేయ అండ్ ఓంకార విశ్వేశ్వర స్వామి,అయ్యప్ప స్వామి వారి దేవస్థానం నందు సర్వ మాలధారణ స్వాములకు ఘనంగా భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

శుక్రవారం 14వ రోజు భిక్ష కార్యక్రమానికి భిక్షప్రదాతలుగా వ్యవహరించారు. తొలుత అయ్యప్ప స్వామి వారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భిక్ష ప్రదాతలైన రెడ్డి అప్పలనాయుడుచే అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు,మహా నైవేద్యం,హారతులు ఇచ్చిన అనంతరం భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. భిక్ష ప్రదాతలను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తలారి రాము గురుస్వామి,ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, ప్రధాన కార్యదర్శి కావూరి వాణిశ్రీ, కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇంచార్జ్ జనసేన రవి, కోశాధికారి పైడి లక్ష్మణరావు,1 టౌన్ మహిళ ప్రధాన కార్యదర్శి వెలగా గాయత్రి,తుమ్మపాల ఉమా దుర్గ, నాయకులు నూకల సాయి ప్రసాద్,కూనిశెట్టి మురళీకృష్ణ,వివిధ హోదాల్లో ఉన్న జనసేన తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు,భారీ సంఖ్యలో సర్వ మాలాధారణ స్వాములు, భవానీలు పాల్గొన్నారు.

## ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం కమిటీల ఎన్నిక



ఏలూరు,మేజర్ న్యూస్ : మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్పర్సన్ పారె లక్ష్మి, సెక్రెటరీ సునీత ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏలూరు జిల్లాలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ జెఏసి అమరావతి జిల్లా చైర్మన్ కె. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏపీ జెఏసి అమరావతి మహిళా విభాగం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లక్ష్మి ఛైర్పర్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏలూరు డివిజన్,జంగారెడ్డి గూడెం డివిజన్ కమిటీల ఎన్నిక జరిగింది. మల్లేశ్వరి, రమాదేవి, ఎన్. రోజా, డి. లక్ష్మి, సత్యవేణి,ఆది లక్ష్మి,బి.ధన లక్ష్మి,పి.వి. రమాదేవి, పార్వతి, కె. హారిక, పి. సుజన ఎన్నికయ్యారు. ఈ సమావేశములో మహిళా విభాగం బలోపేతం తదితర విషయాలపై చర్చించారు. సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర ఛైర్పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే మహిళా ఉద్యోగుల సమస్యలను ఏపీ జెఏసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించలని కోరారు. అన్నీ ప్రభుత్వ కార్యాలయములలో షీ బాక్స్ లను ఏర్పాటుచేసి మహిళలకు అండగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుందరి, గీతిక, శాంత కుమారి, యామిని తదితర మహిళా విభాగం జిల్లా కార్యవర్గంతో పాటుగా అధిక సంఖ్య లో మహిళా ఉద్యోగులను పాల్గొన్నారు.

## చనిపోయిన పోలీసు కుటుంబాలతో ఎస్పి సమావేశం



ఏలూరు,మేజర్ న్యూస్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు జిల్లాలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాలతో సమావేశం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ డిసీజ్ ఫ్యామిలీ సభ్యులతో మాట్లాడుతూ వారికి ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా ఆర్థిక పరమైనటువంటి అంశాలు అందినట్లు ఇంకా ఏది రావాలనే విషయాలపై డిసీజ్ ఫ్యామిలీ సభ్యులను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. డిసీజ్ ఫ్యామిలీలో అర్హులైన సభ్యులకు కారుణ్య నియామకాల కొరకు వారి ఎవరెవరు అప్లై చేసుకున్నారు దాని,స్థితి ఏమిటి అని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్న అదనపు ఎస్పీ అడ్మిన్. ఈ కార్యక్రమంలో ఏవో బీవీఎస్ఆర్కే నాయక్,ఆఫీస్ సిబ్బంది జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్ బాబు,ఆర్.ఎస్. ఐభాస్కరరావు,అదనపు ఎస్పీ సిసి సాయి రామ్ డిసీజ్డ్ ఫామిలీస్ కుటుంబ సభ్యులు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలతో ఎమ్మెల్యేలో సొంగ రోషన్ కుమార్





**– ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 1045 సమస్యలు**

**కామవరపుకోట,మేజర్ న్యూస్:** కామవరపుకోట మండలంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్. మండలంలో 1045 ప్రజా అర్జీలు స్వయంగా స్వీకరించారు. ప్రజల కోసం వినతులు స్వీకరించి పరిస్కారం చేయాలనీ అధికారులను కోరారు. ప్రజా గ్రీవెన్స్‌లు తగ్గాలి ప్రజలకు మేలులు జరగాలనేది నా సంకల్పం చింతలపూడి అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని, అధికారులందరు సమిష్టిగా పనిచేయ ండి ప్రభుత్వానికి సహకరించండి మనం ప్రజలకు జవాబుదారిగా ఉండాలి ప్రజలకంటే మనకు ఎక్కువేమి కాదు అన్నారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం మనకు ముఖ్యం చంద్రబాబు ఈ రాష్ట్రం కోసం పడే కష్టం మనం చూస్తూనే ఉన్నాం. మనఅందరం ప్రజలకు సేవ చేయాలి. అంతే తప్ప మన స్వలాభాలకు పనిచేయకూడదు గత ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ తెలిపారు. నడవలేని స్థితిలో ఉన్న వారి దగ్గరికి ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించటంతో వారి కళ్ళల్లో ఆనందం వెళ్ళివెరిశాయి అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయడం ప్రజలతో ఎమ్మెల్యే కార్యక్ర˜మం సక్సెస్‌గా నిరూపించారు ప్రతి పిర్యాదు జనహిత యాప్‌లో నమోదు చేయండి. ప్రతి అర్జీని ఎన్నిరోజులలో పరిష్కరిస్తారో డ్యాష్‌బోర్డులో అని దేశించారు.

## ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు, మేజర్ న్యూస్:** ప్రజా వినతులు స్వీకరించడంతో పాటూ, ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టికనపరుస్తున్నానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు వినతులు అందజేశారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని అప్యాయంగా పలకరించి ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ భరోసా కల్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు చల్లా సత్య వరప్రసాద్, బెల్లపుకొండ కిషోర్, అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి నారాయణపురం రాక

**ఉంగుటూరు,మేజర్ న్యూస్:** త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలోని బిజెపి ఉంగుటూరు అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఇంటి వద్ద శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బిజెపి పార్టీ కార్యకర్తలను కలుస్తారు. మధ్యాహ్నం 1:30 గంటల నుండి 5 గంటల వరకు ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ వద్ద భోజనం కార్యక్రమం,అనంతరం ఆక్వా రైతుల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో ఉంగుటూరు శాసనసభ్యులు పచ్చమట్ల ధర్మరాజు,ఆక్వా రైతులు సుమారు 200 మంది వరకు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత గోపీనాథపట్నం నుండి బయలుదేరి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం చేరుకుంటారు.

## 28,29వ తేదీలలో అంబేద్కర్ గురుకులంలో సైన్స్ ఫెయిర్

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో ఈనెల 28,29వ తేదీలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరుగుతుందని గురుకులం ప్రిన్సిపాల్ బెజవాడ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ద్వారకాతిరుమలలోని డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులం లోప్రారంభం అవుతుందని,ముగింపు కార్యక్రమం 29వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రారంభ, ముంగింపు కార్యక్రమాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా" డోల శ్రీబాలా వీరాంజనేయస్వామి, జిల్లా ఇంచార్జి,రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్,రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి,జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు,శాసన సభ్యులు,ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈ 26 తేదీన ప్రారంభం అయ్యే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యురాలు జాలా సుమతి బాలాజీ కోరారు. కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన మొదటి పార్టీ టీడీపీ అని అన్నారు. కేవలం 100 రూపాయలకే పార్టీ సభ్యత్వం అని,సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమాను 1లక్షల నుండి 5లక్షలకు పెంచారని అన్నారు. అంతేకాకుండా సాధారణ మరణం పొందిన వారికి 10వేలు రూపాయిలను దహన సంస్కార ఖర్చులకు ఇస్తామని అన్నారు. కేంద్రంలో మోడీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అన్నీ రంగాలలో అభివృద్ధి చెందుతుందని పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు.

# రూ.21 లక్షల 56 వేల విలువైన 154 సెల్ ఫోన్లు స్వాధీనం






– పోగొట్టుకున్న వారికి అందజేసిన జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు,మేజర్‌న్యూస్ : ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2024 మే నుండి మే,జూన్ నెలలలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి కొరకు ప్రత్యేకముగా టోల్ ఫ్రీ నెంబర్: 9550351100 ను ప్రజలకు అందుబాటులో ఉంచిన నేపథ్యంలో రూ. 21 లక్షల 56 వేల విలువైన 154 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్టు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. సి.సి.యస్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సి. హెచ్. రాజా శేఖర్ , ఏలూరు సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ ఐ.గోపాలకృష్ణ , ఎస్.ఐ. బి.ఎం.వి మధు రాజా ఆధ్వర్యంలో పోలీస్ సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా 13 వ దఫా లో భాగంగ ఇప్పటి వరకు 154 మొబైల్ ఫోన్ల రికవరీ చేశారు. ఏలూరు జిల్లాలో వివిధ ఫిర్యాదుదారుల మొబైల్ హ్యాండ్ సెట్లు దొంగిలించబడిన, మిస్సింగ్ మొబైల్ హ్యాండ్ సెట్లను ఐఎంఇఐ నంబర్ల ద్వారా స్వీకరించి, ప్రస్తుత వినియోగదారులను కనుగొని, వారికి అందజేస్తున్నట్టు తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి,ఎన్టీఆర్ జిల్లా,అంబేద్కర్ కోనసీమ,కృష్ణా,విశాఖ పట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, విశాఖ, తెలంగాణ తదితర ప్రదేశాల నుండి స్వాధీనం చేసుకున్న 154 మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.21 లక్షల 56 నేను అని తెలిపారు. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ వివరాలు : మొదటి దఫా నుండి 12 వ దఫా వరకు పోయిన సెల్ ఫోన్లు 1606 రికవరీ చేసినట్లు వాటి విలువ సుమారు రూ. 3,11,83,684 జిల్లాలో టోల్ ఫ్రీ నెంబర్: 9550351100 ను ప్రజలకు అందుబాటు లోనికి తెచ్చి నప్పటినుండి ఇప్పటి వరకు మొత్తం 3,668 పోయిన సెల్ ఫోన్ లు పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదు లకు గాను 1,760 సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు, వాటి విలువ రూ. 3,33,39,684 రికవరీ శాతం 48 శాతం అని ఎస్పీ వివరించారు.

## జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రారంభం



ఏలూరు,మేజర్ న్యూస్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి 21వ జాతీయ పశు గణన సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 21వ జాతీయ పశు గణన సర్వే ప్రారంభ సందర్భంగా సంబంధిత గోడ పత్రికను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు.పశుగణన సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లా పశు వైద్యాధికారులు పశుగణన కోసం నియమించి, శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బందితో 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో 27 మండలాలకు సంబంధించి 227 మంది ఎన్యూమరేటర్స్, 53 మంది సూపర్వైజర్స్ ఈ గణన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.ఇందులో భాగంగా జిల్లాలో పశువులు, పెంపుడు జంతువులు,గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు,కోళ్లు ఎన్ని ఉన్నాయనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి పక్కాగా వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా ప్రస్తుతం చేపట్టనున్న గణాంకాలతో ఈ లెక్కలు పక్కాగా తేలనున్నాయి. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి నెహ్రూ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ డా.లక్ష్మీనారాయణ, ఎ న్యూమరేటర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్దు

– గ్రామ సర్పంచ్ మేరీ నవరత్న కుమారి డిమాండ్



కైకలూరు,మేజర్ న్యూస్: స్థానిక వెలమపేట పాఠశాలను ఆనుకొని విద్యుత్ ఏఈ,సిబ్బంది ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నిలుపుదల చేయాలని విద్యార్థులకు ప్రాణహాని ఉందని గ్రామ సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి సర్పంచ్ పాఠశాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు ఆడుకునే సమయంలో విద్యుత్ వల్ల ప్రాణహాని జరిగే ప్రమాదం పొంచి ఉందని ట్రాన్స్ఫార్మర్ వేరే స్థలంలోకి ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడ వద్దని తెలియజేశారు.

## వేగవంతంగా విద్యార్థులకు 'అపార్' గుర్తింపు కార్డుల నంబర్ల ప్రక్రియ



ఏలూరు,మేజర్‌న్యూస్: ఏలూరు జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులందరికీ 'అపార్' (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు నంబర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ కి చెప్పారు. 'అపార్' ఐడి లు జారీ,మెగా డిఎస్సిలో పోస్టుల వారీగా రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ల ఖరారు, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలపై పాఠశాల విద్యా శాఖ కమీషనర్ డా.విజయరామరాజుతో కలిసి రాష్ట్ర సెక్రటేరియట్ నుండి శుక్రవారం సాయంత్రం రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోన శశిధర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి పెంపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించామన్నారు. ఇందుకు అవసరమైన వివిధ సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని విద్యార్థినీ,విద్యార్థులకు 'అపార్' ఐడిలు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని,ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్,టీచర్స్ మీటింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేసారు.

## అక్రమ మద్యం పట్టివేత



పెదపాడు,మేజర్ న్యూస్: ఎస్ఐ కట్టా శారద సతీష్ కి రాబడిన సమాచారం మేరకు మండలంలోని సత్యవోలు గ్రామములో అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఓల్డ్ టవర్స్ 21 మద్యము బాటిల్ ఎం.సి విస్కీ బాటిల్ 4 మన్షన్ హౌస్ బాటిల్ 6 అన్ని క్వార్టర్ బాటిల్లు బేత దుర్గ ఫణీంద్ర బాబు అనే వ్యక్తి వద్ద వద్ద స్వాధీనం చేసుకొని అతని పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

### పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే బాలరాజు



జీలుగుమిల్లి, మేజర్ న్యూస్: పల్లె పండుగతో గ్రామాల రూప రేఖలు మారుతున్నాయని శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని టి.గంగన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో"పల్లె పండుగ"పంచాయతీ వారోత్సవాలసందర్భంగా పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, డి ఈ. సీతయ్య, సర్పంచ్ కోర్స వెంకటలక్ష్మితో కలిసి ఆయన నూతన సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. పంచాయ తీలో ఉన్న పలు సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడారు. దిబ్బగూడెంలో గ్రామంలో ఉన్న డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే బాల రాజు స్పందించి సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే ఎన్నడూ లేని విధంగా జీలుగుమిల్లి మండలానికి రూ.6 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు. గ్రామస్తుల నుండి పలు సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పసుపులేటి రాము,మండల కార్యదర్శి కొమరం వెంకటేశ్వరరావు,కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# సురక్షితమైన ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

– శనివారం ఏలూరులో మూడు ప్రాంతాల్లో తనిఖీలు

– జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీ





ఏలూరు,మేజర్ న్యూస్: సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేనిపక్షంలో శిక్షార్హులవుతారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, రోడ్డు భద్రతా చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాలా మంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించని కారణంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ఇది ఎవ్వరినీ బెదిరించేదికాదని పేర్కొంటూ వారి సురక్షిత ప్రయాణానికి రక్షణాచర్యలేనని స్పష్టం చేశారు. ఏలూరులో శనివారం వట్లూరు, ఫైర్ స్టేషన్ సెంటర్,సి.ఆర్.రెడ్డి పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహనచోదకులపై నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధించడం, హెల్మెట్ అందించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో తాము,జిల్లా ఎస్పీ పాల్గొంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివాహణకు జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రహదారి భద్రత అందరి బాధ్యతగా గుర్తెరిగాలన్నారు. జిల్లాలోని ఎన్ హెచ్ కి సంబంధించి 8 పెట్రోలింగ్ వాహనాలు ఉన్నాయని, వారుకూడా పోలీస్, రవాణా శాఖలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఇంచార్జి ఉప రవాణా కమీషనరు కె.ఎస్.ఎంవి కృష్ణారావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ మోషే, ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్,డిఇఓ ఎస్. అబ్రహాం, డిఎంహెచ్ఓ డా. ఎస్. శర్మిష్ట, పలువురు పంచాయితీరాజ్,జాతీయ రహదారి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.